## చలివేంద్రం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 4 : గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో ఆయన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు, ప్రజలకు దాహం తీరుతుందన్నారు. అనంతరం అమరేందర్‌గౌడ్‌తో కేక్‌కట్ చేయించి తినిపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, బీఆర్‌ఎస్ నాయకులు కొలుపుల అమరేందర్, ఎనబోయిన ఆంజనేయులు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్‌గౌడ్, బీరు మల్లయ్య, సురేపల్లి రమేశ్, అతికం లక్ష్మీనారాయణ, ఇట్టబోయిన గోపాల్, పుట్ట వీరేశ్, తాడూరి భిక్షపతి, పెంట నితిన్, మహేశ్, కస్తూరి పాండు, సామల వెంకటేశ్, చిందం మల్లికార్జున్, కొండ స్వామి, శివకుమార్ పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం : బీఆర్‌ఎస్‌వీ



మోత్కూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

మోత్కూరు, ఏప్రిల్ 4 : హెచ్‌సీయూ భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని బీఆర్‌ఎస్‌వీ నాయకుడు జంగ శివ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎంలా కాకుండా రియల్‌ఎస్టేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వానికి చెందిన విలువైన భూములను అధికారులను బెదిరింపులకు గురి చేసి అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. న్యాయమైన తీర్పును వెలువరించిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పబ్బు ప్రవీణ్, జిట్ట సాయికుమార్, గనగాని రాజేశ్, దాసరి నరేశ్, నవీన్, పొన్నెబోయిన మత్స్యగిరి, చుక్క అశోక్ పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జి దుర్మార్గం : జైపాల్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌నాయక్

బొమ్మలరామారం, మార్చి 4 : హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులపై విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి, అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వ దుర్మార్గ చర్య అని బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం జనరల్ సెక్రటరీ మోగావత్ జైపాల్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించాలనుకోవడం, జీవవైవిధ్యాన్ని నాశనం చేయడమంటే విద్యార్థుల భవిష్యత్‌ను తాకట్టు పెట్టడమేనన్నారు. కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కంచల్‌తండా గ్రామశాఖ అధ్యక్షుడు సుమన్ నాయక్, గోవింద్ తండా, యూత్ అధ్యక్షుడు శ్రీధర్ నాయక్, పాల్గొన్నారు

## బస్సులు నిలుపాలని డీఎంకు వినతి



ఆర్టీసీ డీఎం మురళీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 4 : యాదగిరిగుట్టకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను పట్టణంలోని బస్టాండ్ వద్ద నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీకృష్ణను కలిసి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా బస్సులు పట్టణంలోని బస్టాండ్‌కు వెళ్లకుండా కొండ పైనున్న బస్టాండ్‌కు వెళ్తున్నాయన్నారు. దీంతో పట్టణంలోని రాజాపేట, యాదగిరిగుట్టతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డీఎం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మండల కార్యవర్గ సభ్యుడు మాటూరి మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ



శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు బుర్ర అనిల్‌కుమార్

మోత్కూరు, ఏప్రిల్ 4 : ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా అకడమిక్ ఇయర్ ప్రారంభం కాకముందే అడ్మిషన్లు తీసుకుంటున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్ర అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించి యాజమాన్యంతో మాట్లాడారు. ఇప్పుడే పై తరగతుల పుస్తకాలను కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తేస్తూ, పాఠశాలలోనే పుస్తకాలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పెరిక రాకేశ్, ప్రశాంత్, నాగరాజు పాల్గొన్నారు.

## భీమలింగం కత్వా వద్ద పోటెత్తిన వరద



లో లెవల్ బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరద

వలిగొండ, ఏప్రిల్ 4 : హైదారాబాద్‌తో పాటు మూసీ ఎగువ ప్రాంతంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని సంగెం గ్రామంలో గల భీమలింగం కత్వ వద్ద వరద పోటెత్తింది. సంగెం – బొల్లేపల్లి గ్రామాల మధ్య మూసీ నదిపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహించి ప్రజా రవాణాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం ఎస్‌ఐ యుగంధర్ ఆధ్వర్యంలో బ్రిడ్జికి ఇరువైపులా ప్రమాద హెచ్చరికల బోర్డులు, పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. వరద ఉధృతంగా వస్తున్నందున మూసీ నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు.

## సంగెం కృష్ణకు సన్మానం



కృష్ణను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 4 : దుండిగల్‌లోని ప్రసిద్ధ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో భగవద్గీత శ్లోకాల పఠనంలో భూదాన్ పోచంపల్లి పట్టణానికి చెందిన సంగెం కృష్ణ ప్రతిభను చాటి గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణకు సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, ప్రతినిధులు యాదగిరి, బాలరాజు, కృష్ణ, యతీనందం, రామచంద్రం, పాండు, గణేశ్, ప్రసాద్ పంతులు, దశరథ పాల్గొన్నారు.

## 4కిలోల గంజాయి పట్టివేత



నిందుతుడు అచ్చు పదన్

చౌటుప్పల్, ఏప్రిల్ 4 : మండలంలోని కొయ్యలగూడెం ప్రిస్టీన్ పరిశ్రమ కూలీ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీ అచ్చు పదన్ గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. అతడిని తనిఖీ చేయగా 4కిలోల గంజాయి పట్టుబడింది. పోలీసులు సరుకును స్వాధీనం చేసుకొని నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

# హెచ్‌సీయూ భూములను అమ్మితే సహించేది లేదు

- చరిత్రహీనుడిగా మిగిలిపోతున్న రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

ఆలేరు టౌన్, మార్చి 4 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్మితే సహించేది లేదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆలేరు పట్టణంలోని రహదారి బంగ్లాలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఎవరూ బాగాలేరన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖపు, ఒంటెద్దు పోకడల పాలనను చూసి అసహించుకుంటున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక చర్యలపై నిరసనలు తెలిపితే అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, కేసులతో భయభ్రాంతులకు గురి చేయడం రేవంత్‌రెడ్డి సర్కారుకు అలవాటుగా మారిందన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షంగా, అభివృద్ధి పథంలో పయనిస్తే.. కాంగ్రెస్ పాలనలో తిరోగమన దిశగా వెళ్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ భూముల్లో రాత్రికి రాత్రి బుల్డోజర్లను దింపి, పచ్చని చెట్లను కూల్చడమే గాక, వన్యప్రాణులను తరిమివేయడం బాధకరమన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారంతో తెలంగాణను పచ్చల హారం చేస్తే నేడు రేవంత్‌రెడ్డి బూడిద చేస్తుండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా, లగచర్ల ఘటనలు కాంగ్రెస్ పాలన తీరుకు నిదర్శనమన్నారు. హెచ్‌సీయూలో గుంట నక్కలు ఉన్నాయంటూ సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడడం ప్రజా పాలనకు పరాకాష్ట అన్నారు. రేవంత్‌రెడ్డి చరిత్రహీనుడిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై అసత్య ప్రచారాలు చేయడమే రేవంత్‌కు తెలుసన్నారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం ప్రాజెక్టులపై ఈడీ విచారణ వరకు తీసుకెళ్లగలిగినా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని తేలిపోయిందన్నారు. సమావేశంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు మొరిగాడి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు కొలుపుల హరినాథ్, ఆడెపు బాలస్వామి, బేతి రాములు, ఎండీ ఫయాజ్, బింగి రవి, మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, పాశికంటి శ్రీనివాస్, రచ్చ రామనర్సయ్య, చిమ్మి శివమల్లు, నారాయణ, సిద్ధులు, బాలరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దు : కలెక్టర్



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి, ఏప్రిల్ 4 : అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని కలెక్టర్ హనుమంతరావు భరోసా ఇచ్చారు. మండల కేంద్రంతో పాటు దయ్యంబండా తండాలో ఈదురు గాలులు, అకాల వర్షంతో దెబ్బతిన్న పలువురు రైతులకు చెందిన వరి, మామిడి, మిర్చి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ దేశ్యానాయక్, సుభాషిని, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల వ్యాప్తంగా వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరిశీలించారు. తుర్కపల్లి, మంచిరోణిమామిళ్ల, దయ్యంబండా తండాల్లో మామిడి, వరి పంటలు పరిశీలించి పరిహారం అందేలా చూస్తానన్నారు.

## ఎన్‌డీఏ కూటమి నాయకుల దిష్టిబొమ్మల దహనం



మోదీ, చంద్రబాబు, నితీశ్‌కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ముస్లిం నాయకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 4 : వక్ఫ్ బోర్డు వ్యతిరేక బిల్లును వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు శుక్రవారం పట్టణంలోని వినాయక చౌరస్తాలో ఆందోళన చేస్తూ ఎన్డీఏ నేతలు మోదీ, చంద్రబాబు, నితీశ్‌కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ముస్లిం సమాజాన్ని టార్గెట్ చేస్తూ మత స్వేచ్ఛా హక్కులను హరించే విధంగా వక్ఫ్ సవరణ బిల్లును పాస్ చేయడం దురదృష్టకరమన్నారు. ముస్లిం ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్ వారిని మోసం చేశారని మండిపడ్డారు. నాయకులు ఎంఏ.రహీం, అవేజ్, షేక్ మీరా, సలావుద్దీన్, లాయిఖ్ అహ్మద్, ఆబెద్ అలీ, ఇస్తియాక్, రఫియొద్దీన్, బుర్హాన్, షరీఫ్, షకీల్, జహీద్, ఖలీల్ పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు : సీపీఎం

గుండాల, ఏప్రిల్ 4 : సుప్రీం కోర్టు ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెపురం రాజు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌సీయూ భూముల్లో చెట్లు తొలగించొద్దని సుప్రీం ఆదేశాలు హర్షణీయమని, ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించాలన్న ఆలోచన దుర్మార్గమన్నారు. ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంపై కన్నేసిందని విమర్శించారు. పాలకులకు వాటాలు పంచుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని మండిపడ్డారు.

## విద్యార్థులకు రవాణా భత్యం అందజేత

గుండాల, ఏప్రిల్ 4 : వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌కు విద్యనభ్యసించడానికి వస్తున్న విద్యార్థులకు సీఆర్పీ లింగయ్య శుక్రవారం రవాణా భత్యాన్ని అందించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు మండల కేంద్రానికి విద్యనభ్యసించడానికి ఆటోలు, సైకిల్‌పై వస్తున్న విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున పది నెలలకు గానూ రూ.6 వేలు విద్యార్థుల అకౌంట్లలో జమ చేసిన నగదును వారికి అందించినట్లు ఆయన పేర్కొన్నారు. గుండాల జడ్పీహెచ్‌ఎస్‌లో చదువుతున్న గంగాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు అల్వాల దుర్గాప్రసాద్, అల్వాల కావ్య, అల్వాల కల్పన, అల్వాల సారికకు అందించారు.

## నేడు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 4 : పట్టణంలోని ప్రిన్స్ కార్నర్ వద్ద గల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆయన 118వ జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహించనున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వసంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు నిర్వహించే కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, దళిత సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వీధి కుక్కలు, కోతుల నియంత్రణ చర్యలు చేపట్టాలని వినతి

చౌటుప్పల్, ఏప్రిల్ 4 : మండలంలోని అంకిరెడ్డి గూడెం గ్రామంలో వీధి కుక్కలు, కోతుల నియంత్రణ చర్యలు చేపట్టాలని జీఎంపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాపురం పాండుకు వినతి పత్రం అందజేశారు. గొర్రెల మందపై కుక్కలు పడి మూగజీవాలను చంపేస్తున్నాయని వారు పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా నీటి తొట్లు మరమ్మతు చేయించి నీటిని నింపాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో జీఎంపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం, నాయకులు భీమనగోని బాలరాజు యాదవ్, లింగస్వామి, మల్లేశం, శ్రీనివాస్, శ్రీనివాస్, జంగయ్య పాల్గొన్నారు.

## సంస్థాన్ నారాయణపురం తాసీల్దార్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 4 : సంస్థాన్ నారాయణపురం మండల తాసీల్దార్‌గా పి.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన తాసీల్దార్ మామిడి కృష్ణ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి నారాయణపురం తాసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

## చెరువులో పడి ఎద్దు మృతి

అడ్డగూడూరు, ఏప్రిల్ 4 : మండలంలోని కోటమర్తి గ్రామ చెరువులో శుక్రవారం ఎద్దు పడి మృతిచెందింది. బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ఆకుల మల్లయ్య తన రెండు కోడెలను రోజు మాదిరిగానే మేపడానికి గ్రామంలోని పెద్ద చెరువు వద్దకు తోలుకుపోయాడు. ప్రమాదశవత్తు అందులో ఒక కోడె చెరువులో పడి అక్కడికక్కడే మృతి చెందింది. దాంతో బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. కోడె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నాడు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటయ్య



బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 4 : జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు భువనగిరి కోర్టు ఆవరణలో శుక్రవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 136 మంది ఓటర్లు ఉండగా, 133 మంది వినియోగించుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వలందాసు వెంకటయ్య ప్రత్యర్థిపై 9ఓట్ల తేడాతో ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ఎర్ర రేణుక, జనరల్ సెక్రటరీగా డాక్టర్ బొల్లెపల్లి కుమార్, జాయింట్ సెక్రటరీగా సీహెచ్.ఐలయ్య, లైబ్రరీ సెక్రటరీగా సామల రాజేందర్‌రెడ్డి, కల్చరల్ సెక్రటరీగా పల్లెర్ల నరహరి, ట్రెజరర్‌గా బుద్ధసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కందుల రాకేశ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిట్టా భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా సీహెచ్.సిద్ది రాములు, శివకిరణ్ వ్యవహరించారు.

## యువ వికాసంతో యువతకు ఉపాధి

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 4 : రాజీవ్ యువ వికాసం పథకంతో యువత ఆర్థికంగా ఎదుగుతారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణను శుక్రవారం ఆయన పరిశీలించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పథకంపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రేషన్‌కార్డు కలిగి ఉంటే చాలని, కుల ధృవీకరణ అవసరం లేదని స్పష్టం చేశారు. మీసేవ, ఈ సేవ కేంద్రాల నిర్వాహకులు దరఖాస్తుదారుల నుంచి అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం మండలంలోని హన్మాపురం గ్రామంలో గతంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇచ్చిన భూములపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్ రావు, తాసీల్దార్ అంజిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ దినకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## జాతీయ ప్రయోజన పథకం మంజూరు చేయాలని వినతి



తాసీల్దార్ దేశ్యానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న ఒంటరి మహిళలు

తుర్కపల్లి, ఏప్రిల్ 4 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద రూ.20వేలు మంజూరు చేయాలని కోరుతూ ఒంటరి మహిళలు శుక్రవారం తాసీల్దార్ దేశ్యానాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భర్త కోల్పోయిన తమకు ఏ ఆధారం లేదని, ఆసరా పింఛన్ సైతం రావడం లేదని, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద తమకు రూ.20వేలు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. దీనికి తాసీల్దార్ సానుకూలంగా స్పందించినట్లు మహిళలు తెలిపారు. అంతకు ముందు ఒంటరి మహిళలు పిలుపు సంస్థ కార్యాలయం నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిలుపు సంస్థ వ్యవస్థాపకులు జనార్దన్, డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సిబ్బంది లక్ష్మి, ఫాతిమా, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉగ్ర దాడిలో అమరులైన పోలీసులకు నివాళి



అమరులైన ఎస్‌ఐ సిద్ధయ్య, కానిస్టేబుల్ నాగరాజుకు నివాళి అర్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణయ్య, పోలీసు సిబ్బంది

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 4 : సిమి ఉగ్రవాదుల దాడిలో అమరులైన ఎస్‌ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజు చిత్రపటాలకు ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఎస్‌ఐ కృష్ణయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కేశవరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు మల్లేశం, యాకుబ్, కానిస్టేబుళ్లు రాంచందర్, శివచారి, ప్రియాంక, ప్రేమలత తదితరులున్నారు.

## సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

బొమ్మలరామారం/ఆత్మకూరు(ఎం) , ఏప్రిల్ 4 : మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, రేషన్ డీలర్ బేతాళ సంధ్య పాల్గొన్నారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో కూడా ప్రభుత్వ విప్ సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, ఏప్రిల్ 4 : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 77మందికి మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం కక్కిరేణి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోళ్ల కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ తనిఖీ



సన్న బియ్యం పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 4 : మండల కేంద్రంలో శుక్రవారం సన్నబియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ దుకాణాన్ని అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి తనిఖీ చేసి పరిశీలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రేషన్ డీలర్లు అర్హులందరికీ సన్నబియ్యం అందించాలని ఆదేశించారు. వారి వెంట తాసీల్దార్ లావణ్య, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, రేషన్ డీలర్లు చెరుకు శోభ, ఇస్తారి, వెంకన్న తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- జడ్పీ సీఈఓ శోభారాణి



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 4 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రక్రియను వేగవంతం చేయాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. మండలంలోని మందోళ్లగూడెంలో శుక్రవారం ఇండ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను లబ్ధిదారులకు వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రాజీవ్ వికాస్ దరఖాస్తులను పరిశీలించారు. స్థానిక రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌కు పోలీసుల సహకారం : డీసీపీ



సీనియర్ సిటిజన్ నిబంధనల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డీసీపీ అక్షాంశ్‌యాదవ్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 4 : జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో వృద్ధులకు వారసులు వేధించకుండా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని డీసీపీ అక్షాంశ్‌యాదవ్ అన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ 2007 చట్టం నిబంధనలకు సంబంధించిన ఫ్లెక్సీని శుక్రవారం డీసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలకు 2007 చట్టం నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్స్, పోలీస్ స్టేషన్లను ఆశ్రయించకుండా వారి వారసులకు, తల్లిదండ్రులను పోషణ, సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణతోపాటు ఇబ్బందులకు గురిచేయకుండా ఉండాలని అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఏఎస్‌సీఏ జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, కోశాధికారి దర్గాయి నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శి పాశం రాములు, సభ్యులు ధర్మయ్య, కృష్ణమూర్తి, రోమన్, పాల్గొన్నారు.

## 'రజకుల సమస్యలు పరిష్కరించాలి'

రామన్నపేట, ఏప్రిల్ 4 : రజకుల సమస్యలను పరిష్కరించాలని రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అవనగంటి స్వామి, జిల్లా నాయకుడు బొడ్డుపల్లి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో ఈ నెల 8న నిర్వహించే రజక వృత్తిదారుల మండల స్థాయి సదస్సు కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో చేతివృత్తిదారులకు మొండి చేయి చూపించాయని విమర్శించారు. కార్యక్రమంలో రజక సంఘం మండలాధ్యక్షుడు కొండూరు శంకరయ్య, నాయకులు పొన్న ఉప్పలయ్య, అక్కెనపల్లి లింగయ్య, మాంద్ర మల్లేశం, లచ్చయ్య, శంకరయ్య, నాగయ్య, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.